



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్

ప్రత్యేక హోదా కోసం ఒత్తిడి తేవాలి

మాజీ మంత్రి శైలజనాథ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఎఐసిసి సెక్రెటరీ మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ డిమాండ్ చేశారు. మన రాష్ట్ర ఎంపీలపై ఆధారపడి ఉన్న కేంద్ర ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున నిధులు రాబట్టాలని కోరారు. ఆదివారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కె. బాబురావుతో కలిసి శైలజ నాథ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ జరిగి పదేళ్లయిందని, చంద్రబాబు ఐదేళ్లు, జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించారన్నారు. ఇద్దరూ రాష్ట్రాన్ని అభివద్ధి చేస్తామని హామీ ఇచ్చి రాజ్యాంగబద్ధంగా ఉంటామని, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని అధికారంలోకి వచ్చి పదేళ్లు గడిపేశారన్నారు. ఏపీలో అన్ని జిల్లాల అభివృద్ధి కోసం పనిచేయాలన్నారు. పరిశ్రమలు రావాలన్నా ప్రత్యేక హోదా రావాలని రాష్ట్రానికి జీవధార ప్రత్యేక హోదా అని గాంధీ మార్గంలో సహాయ నిరాకరణ చేసైనా రాష్ట్ర అభివృద్ధిని సాధించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, పిసిసి అధికార ప్రతినిధి బి చిన్న రామాంజనేయులు, జిల్లా కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, డిసిసి ఉపాధ్యక్షులు కె. వెంకటరెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, కాంగ్రెస్ ఎస్‌సి సెల్ జిల్లా చైర్మన్ ఇ లాజరస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.ప్రమీల, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఎన్ సి బజారన్న లు పాల్గొన్నారు.

జమకాని పరిహారం



హోళగుంద మండలంలో గొర్రెలకు వదిలేసిన పంట (ఫైల్)

- తప్పుగా వివరాల నమోదు- రైతన్నలకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గత ఖరీఫ్ కరువు మండలాలకు సంబంధించి నష్టపరిహారం గత ప్రభుత్వం మార్చిలో విడుదల చేసింది. వేలాది మంది రైతులకు ఇప్పటి వరకూ పరిహారం జమ కాలేదు. రైతుల వివరాలు తప్పుగా నమోదు చేయడంతో రైతుల ఖాతాల్లో పరిహారం జమ అవ్వలేదు. వివరాలను సరి చేసుకునేందుకు రైతులకు కనీస సమాచారం ఇవ్వకపోవడంతో రైతన్నలకు తిప్పలు తప్పడం లేదు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 30 కరువు మండలాలను ప్రభుత్వం ప్రకటించింది. కర్నూలు జిల్లాలో 24 మండలాలను, నంద్యాల జిల్లాలో 6 మండలాలను 2023 ఖరీఫ్‌కు సంబంధించిన కరువు మండలాలుగా గుర్తించింది. వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి 3.75 లక్షల మంది రైతులకు గత ప్రభుత్వం మార్చి మొదటి వారంలో రూ.460.57 కోట్ల నష్టపరిహారాన్ని విడుదల చేసింది. అయితే ఇప్పటి వరకూ 51,508 మంది రైతులకు నష్టపరిహారం వారి ఖాతాల్లో జమ కాలేదు. వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది రైతుల వివరాలను తప్పుగా నమోదు చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. కరువు మండలాలకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది గ్రామ స్థాయిలో రైతుల వివరాలను సేకరించి అప్‌లోడ్ చేశారు. ఆ ప్రక్రియలో రైతుల వివరాలను తప్పుగా నమోదు చేశారు. దీంతో రైతులకు నష్ట పరిహారం జమ కాకుండా పోయింది. వినియోగం లేని ఖాతాల వివరాలను నమోదు చేయడం, రైతు బ్యాంకు ఖాతాల నంబర్లు, ఐఎఫ్ఎస్‌సి కోడ్ వంటి వివరాలను తప్పుగా నమోదు చేయడంతో పరిహారం రైతులకు అందకుండా పోయింది. కర్నూలు జిల్లాలో 15,457 మంది రైతులకు సంబంధించిన వివరాల్లో వినియోగం లేని ఖాతాల వివరాలను నమోదు చేశారు. దీంతో వారికి రావాల్సిన రూ.23.49 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. 34,433 మంది రైతుల వివరాల్లో బ్యాంకు ఖాతాల వివరాలను తప్పుగా నమోదు చేశారు. దీంతో రైతుల ఖాతాల్లో రూ.47.31 కోట్ల పరిహారం జమ కాలేదు. నంద్యాల జిల్లాకు సంబంధించి 248 మంది రైతుల వివరాల్లో వినియోగం లేని ఖాతాల వివరాలను నమోదు చేశారు. ఆ రైతులకు రూ.31.49 లక్షల పరిహారం అందలేదు. 1,370 మంది రైతుల వివరాల్లో తప్పు ఖాతాల వివరాలను నమోదు చేశారు. దీంతో ఆ రైతులకు సంబంధించిన రూ.1.56 కోట్ల పరిహారం ఖాతాల్లో జమ కాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15,705 మందికి సంబంధించి వినియోగం లేని ఖాతాల వివరాలను, 35,804 మంది రైతులకు సంబంధించి ఖాతాల వివరాలను తప్పుగా నమోదు చేశారు. ఈ కారణంగా మొత్తం 51,508 రైతులకు సంబంధించిన రూ.72.67 కోట్ల పంట నష్ట పరిహారం వారి ఖాతాల్లో జమ కాలేదు. ఈ తప్పులకు వ్యవసాయ సిబ్బందే కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు మండలాల్లో తప్పుగా వివరాలు నమోదు కావడం వల్ల పరిహారం అందని రైతుల వివరాలను సచివాలయాల్లో ప్రదర్శించలేదు. తమకు ఎందుకు నష్ట పరిహారం రాలేదో తెలియకపోవడంతో పరిహారం అందని రైతులు తమ వివరాలను సరిచేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. తమ వివరాల్లో ఏం తప్పులు ఉన్నాయో తెలియజేసి ఆ వివరాలను సరి చేసుకునేందుకు అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.



హనుమంత నాయుడు రచించిన విద్యార్థి శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాంబశివరెడ్డి, నాగరత్నమ్మ, సురేష్‌కుమార్

బాల్యదశ నుంచే విద్యను పెంపొందించుకోవాలి

విద్యార్థి శతకం పుస్తకావిష్కరణ

యుటిఎఫ్ జిల్లా మాజీ గౌరవ అధ్యక్షులు హనుమంత నాయుడు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-పత్తికొండ

విద్యార్థులు బాల్య దశ నుంచే విద్యను పెంపొందించుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పత్తికొండ పట్టణంలో రమ్య రిసార్ట్స్ ఫంక్షన్ హాలులో యుటిఎఫ్ నాయకుడు ప్రసాద్ బాబు అధ్యక్షతన యుటిఎఫ్ జిల్లా మాజీ గౌరవ అధ్యక్షులు హనుమంతు నాయుడు ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హనుమంతు నాయుడు రచించిన విద్యార్థి శతకం అనే పుస్తకాన్ని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, పత్తికొండ మాజీ ఎంపిపి నాగరత్నమ్మ, కెడిసిసి మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్ ,ఎస్‌టియు రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రవికుమార్, ముస్లిం మైనార్టీ నాయకుడు టిఎండి హుస్సేన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై హనుమంతు నాయుడు నిరంతరం పోరాడారని అన్నారు. విద్యార్థులకు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన చదువు చెప్పిన విద్యార్థులు ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారని అన్నారు. సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై నిరంతరం వెలికితీసే వారని అన్నారు. హనుమంతు నాయుడు కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో శేషజీవితం గడపాలని అందరి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరారు. యుటిఎఫ్ నాయకులు హనుమంతు నాయుడు, సతీమణి భ్రమరాంబ దంపతులకు శాలువా, పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు నర్సోజి యెహోషువ, రాజమౌళి, వెంకటేశ్వర్ రెడ్డి , ఆది శేఖర్ ,రంగస్వామి, వీరేష్ ,రవి ,ప్రకాష్, ఖలీల్ ,తదితరులు పాల్గొన్నారు.



హనుమంత నాయుడు దంపతులను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు , అతిథులు

కార్పొరేషన్ పరిధిలో సమస్యల తిష్ట

-సిబ్బంది లేమితో లోపించిన పారిశుద్ధ్యం
-అవసరం లేనిచోట నిర్మాణాలు- పెరిగిపోయిన అవినీతి
-నేడు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం
-హాజరుకానున్న మంత్రి టిజి భరత్, ఎమ్మెల్యేలు, ఎంపీలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



కర్నూలు నగరంలో ప్రజా ప్రతినిధులు అధికారుల అలసత్వం, అవినీతి అక్రమాలతో ప్రజా సమస్యలు తిష్టవేసి కూర్చున్నాయి. గత ప్రభుత్వంలో నగరపాలక సంస్థలో ప్రధాన వీధుల్లో మాత్రమే అభివృద్ధి పనులు చేసి నగరమంతా అభివృద్ధి చేసినట్లు ప్రచారం చేసుకున్నారు. శివారు కాలనీలో కొత్తగా ఏర్పాటైన కాలనీలో ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్లు కనిపిస్తున్నాయి. ప్రధానంగా మురుగు కాలువలు, రోడ్లు, కల్వర్టులు, అంతర్గత రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న కాలనీలు చాలా ఉన్నాయి. అవసరం లేని చోట అక్రమనిర్మాణాలు చేపట్టి అవినీతి జరుగుతున్నా...అధికారులు , ప్రజాప్రతినిధులు అడ్డుకట్ట వేయలేక పోయారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో సోమవారం నిర్వహించనున్నారు. కొత్తగా ఎన్నికయిన టిడిపి ప్రభుత్వంలోని మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు కాకున్నారు.

కౌన్సిల్ సమావేశంలో ఆయా కాలనీల కార్పొరేటర్లు ఆ ప్రాంత ప్రజలకు అభివృద్ధి చేయలేక బయట జనానికి ముఖం చూపలేని పరిస్థితి కూడా ఉంది. వైసిపి కార్పొరేటర్లు ఉన్న వార్డులలో కొంత అభివృద్ధి జరిగిందని, ఎక్కువగా 19 వార్డులో అభివద్ధి పనులు చేశారని ఎందుకు ఇలాంటి వివక్ష అని గత సమావేశంలో టిడిపి కార్పొరేటర్లు ప్రశ్నించారు. జై జగన్ అనండి వార్డులకు నిధులు కేటాయిస్తామని సర్వసభ్య సమావేశంలో మేయర్ అనడం విస్మయానికి గురించి చేసింది.

తుంగభద్ర పుష్కరాల సమయంలో కొన్న రూ. నాలుగు కోట్లకు పైగా విలువచేసే పైపులు కాలిపోయినా వాటిపై విచారణ లేదు?.అందుకు సంబంధించిన లెక్కలు చెప్పాలని కార్పొరేటర్లు అడగగా ఆ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిస్తామని డిప్యూటీ కమిషనర్ టి.రామలింగేశ్వర్ కన్వీనర్ గా ఏడుగురు సభ్యులతో విచారణ కమిటీ నియమించారు. కమిటీలోని అధికారులు బదిలీ అయి వెళ్లిపోయారు. ఈ సమావేశంలోనైనా చర్చకు వస్తుందా అని కార్పొరేటర్లు అధికారులు చర్చించుకుంటున్నారు.

పారిశుధ్య సమస్య : నగరంలో జనాభా కనుగుణంగా పారిశుధ్య సిబ్బంది లేక సిల్ట్ తీసే కార్మికులను సైతం 108 మందిని తొలగించడంతో సమస్య జఠిలమై నగరంలో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.కెసి కెనాల్‌లో గుర్రపుడెక్క ఏపుగా పెరిగి మురుగునీరు కదలక దుర్వాసన కొడుతోంది. ప్రజలు ఆవాసన భరించలేక పోతున్నామని ఇటీవల వినాయక ఘాట్ ఏరియాలో పర్యటించిన సిపిఎం బృందం ముందు ఆవేదన వ్యక్తం చేశారు.

హెడ్ వాటర్ వర్క్స్ లో అవినీతి: హెడ్ వాటర్ వర్క్స్ లో భారీగా అవినీతి అక్రమాలు జరిగాయి డిఎలు కలిసి రూ.10 కోట్లతో నిర్వహించిన పైపుల లీకేజీ మరమ్మతులు కొనుగోళ్లకు పనులు చేయకుండానే సామాగ్రి కొన్నట్లు బిల్లులు పెట్టి, నగరంలో మ్యాగ్నెటిక్ ఫ్లోమీటర్ల అమర్చినట్లు రూ.4 కోట్లఅక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది.

రూ.50 కోట్ల పనులలో భారీ అవినీతి: నగరంలో సిసి రోడ్లు కాలువలు నిర్మాణానికి గత మూడు సంవత్సరాల్లో రూ.50 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారు. ఈ నిధులు ప్రధానంగా బాగున్న రోడ్లపై రోడ్లు వేయడం, అవసరం లేని చోట్ల కల్వర్టులు, డ్రెయిన్లు నిర్మించడం, శాస్త్రీయంగా పనులు చేసి, కొన్ని చోట్ల పనులు చేయకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. నాణ్యతలేని పనులు చేసినందుకు కాంట్రాక్టర్లకు సహకరించి బిల్లులు చేయించుకొని రూ.50 కోట్ల నిధుల్లో అవినీతి జరిగినట్లు తెలిసినాకమిషనర్ వారికి నీడలా వెన్నంటి ఉండి సమర్తిస్తున్నారని సమాచారం. ఎన్నికల ముందు సి బిల్లుల కోసం రెండు కోట్లు విడుదల చేశారు. ఒక వర్క్ఇన్‌స్పెక్టర్ సిబిల్లులపై ఉన్నతాధికారితో సంతకం చేస్తూ ఉన్నాడు అంటే బిల్లులలో ఎంత అవినీతి జరుగుతుందో తెలుస్తుంది.

పచ్చదనం పేరుతో 10 కోట్లు: నగరంలో పార్కులు అభివద్ధి పేరుతో ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు జరిగిన నాలుగేళ్ల కాలంలో ఉద్యాన అభివృద్ధి మొక్కలు పెంపకం పేరుతో రూ.10 కోట్ల పైగా అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.

కార్పొరేషన్ లో అవినీతి కి అంతమేది? : కార్పొరేషన్‌లో ఏ శాఖలో చూసినా అవినీతి రాజ్యమేలుతోంది. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య విభాగాలలో కూడా ఏ పని కావాలన్నా మామూల్లు ముట్ట చెప్పాల్సిందే. ఈ అవినీతిని అరికట్టే దమ్ము ధైర్యం గల అధికారి ఉన్నప్పుడే అవినీతి అంతమవుతుంది. రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్నంతవరకు ఉన్నతాధికారులు తమకు అండదండలు ఉంటాయని ధైర్యంతోనే అవినీతికి పాల్పడుతున్నారు. మామూలు ముట్ట చెప్పిన వారి పనులు మాత్రమే సాఫీగా జరిగిపోతున్నాయి. ఈ డబ్బులు వ్యవహారంలోనే ఒక విభాగంలో ఘర్షణలు కూడా జరిగాయి. గతంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు నగరపాలక సంస్థలో అధికారులను పట్టి జైలుకు పంపించినా ఏమాత్రం జంకుకు లేకుండా ప్రయివేటు వ్యక్తులను పెట్టుకుని మామూల్లు వసూలు చేసుకుంటూ పనులు చేస్తున్నట్లు బహిరంగ ప్రచారం జరుగుతుంది



కొత్తగా ఎన్నికైన నాయకత్వాన్ని సన్మానిస్తున్న సభ్యులు

ఎపిపిఇటి, ఎస్ఎపి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

నగరంలోని ఎపిపిఇటి అండ్ ఎస్ఎపి భవన్లో ఆదివారం జిల్లా పిఇటి అండ్ ఎస్ఎపి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జోసెఫ్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా చందు నాయక్, కోశాధికారిగా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడిగా ఎంపికైన జోసెఫ్ లక్ష్మయ్య మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఎంపిక ప్రక్రియతో పాటు జోనల్ గేమ్స్ నిర్వహణ కోసం కలిసికట్టుగా కషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర సంఘం సభ్యులు ఖలీల్ మహమ్మద్, పాండు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కిషోర్ జిల్లా ప్రచార కార్యదర్శి అబ్దుల్ మాలిక్, జిల్లా స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ కార్యదర్శి శేఖర్, వివిధ జోన్ల అధ్యక్ష కార్యదర్శులు, నరసింహారాజు,రామన్న, రంగస్వామి,హనుమన్న, కడ్డీరప్ప నాయక్,విష్ణువర్ధన్‌రెడ్డి, పరమేష్, సుబ్రమణ్యం, వెంకట రాముడు, శేషాద్రి, హుకుం సింగ్, గోపాల్, అస్లాం తదితర వ్యాయమ టీచర్లుపాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

20 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు

ప్రజాశక్తి-తుగ్గలి : మండలం పరిధిలోనే పెండేకల్ రైల్వే జంక్షన్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 ఏళ్ల తర్వాత భార్య పిల్లలతో మిత్రులు కలిసి ఓ కన్నుల పండగలాగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం జరుపుకున్నారు. పాఠశాల వదిలి 20 సంవత్సరాలు తర్వాత మరల చదివిన పాఠశాలలో భార్యా పిల్లలతో మిత్రులంతా కలిసి వారి యోగక్షేమాలు తెలుసుకుని చర్చించుకున్నారు. పెండేకల్ జడ్‌పి పాఠశాలలో 2004-2005 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా కలసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సమావేశానికి మిత్రులు ఉద్యోగరీత్యా లేదా ఇతర వ్యాపారరీత్యా చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, పట్టణాలతో పాటు మిగిలిన వివిధ ప్రాంతాల్లో ఉండే మిత్రులంతా వచ్చారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన ఉపాధ్యాయుల అందరికీ పూర్వ విద్యార్థులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి, గురువుల నుండి ఆశీర్వాదాలు పొందారు. విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ మా దగ్గర విద్యను అభ్యసించిన విద్యార్థులు వారి జీవితంలో వివిధ రంగాలలో స్థిరపడిన విద్యార్థులను సగౌరవంగా అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నక్కరాతి నాగరాజు, పాఠశాల పూర్వపు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ

జూడో మార్షల్ ఆర్ట్స్ పోటీల ప్రారంభంలో డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా దేశానికి ఉపయోగపడే క్రమశిక్షణ గల పౌరులుగా ఎదగాలంటే క్రీడల్లో పాల్గొనడం ఎంతో అవసరమని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న హుస్సేన్ ఖాన్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన జూడో మార్షల్ ఆర్ట్స్ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జూడో మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు షకీల్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు జూడో లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయడం వల్ల క్రమశిక్షణ ఏకాగ్రత పెరిగి చదువులోనూ రాణించే అవకాశం ఉందని చెప్పారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో ప్రతి ఒక్కరు సెల్ ఫోన్‌లకు బానిసలుగా మారారని, సెల్‌ఫోన్‌ను మంచి పనులకు ఎలా వాడవచ్చో, చెడు పనులకు కూడా అలాగే వాడే అవకాశం ఉందని చెప్పారు. మనం వినియోగించే పద్ధతిని బట్టి సెల్ ఫోన్ ప్రభావం ఉంటుందని చెప్పారు. ఇటీవల కాలంలో గంజాయి లాంటి మత్తు పదార్థాలు వివిధ రకాల రూపంలో విక్రయించడం జరుగుతుందని చెప్పారు. ముఖ్యంగా ఇప్పుడు పాఠశాల స్థాయి నుంచి గంజాయి వినియోగం మొదలవుతుందని ఇది దురదృష్టకర పరిణామం అని చెప్పారు. సరైన వ్యాయామం లేకపోవడం వల్ల ఇటీవల కాలంలో చిన్నతనం నుంచే ఊబకాయం సమస్య తలెత్తుతుందని, దీనివల్ల బిపి షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రస్తుతం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం వల్ల కలుషిత నీటి ప్రభావం వల్ల కలిగే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ తాజా పండ్లు, కూరగాయలు తినడం వల్ల అనారోగ్య సమస్యలకు దూరంగా జీవించాలని ఆయన సూచించారు. అందుకే తాను క్రీడాకారులకు పండ్లు, బిస్కెట్లు ,మంచినీరు అందిస్తున్నానని తెలిపారు. జూడో ,కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయడం వల్ల శారీరక ,మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. జూడో, కరాటేలో సాధన చేయడం వల్ల సుదీర్ఘంగా శ్వాస తీసుకోవడం , యోగ ప్రాణాయామం వంటి ఆరోగ్యానికి ఉపయోగపడే ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. కర్నూలు నగరంలో క్రీడలను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం నిరంతరం అందిస్తానని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు.



జూడో మార్షల్ ఆర్ట్స్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కార్పొరేటర్ విజయ ప్రత్యూషకు పితృవియోగం

గుండెపోటుతో బొల్లెద్దుల రామకృష్ణ మృతి

మంత్రి టిజి.భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు సంతాపం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ /కర్నూలు హాస్పిటల్

కర్నూలు 51 వ వార్డు కార్పొరేటర్ బొల్లెద్దుల విజయ ప్రత్యూష తండ్రి టిడిపి నాయకుడు బొల్లెద్దుల రామకృష్ణ ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. తన ఇంట్లో శ్వాస సంబంధ వ్యాధితో నిద్రలోనే తొలి శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామకృష్ణ మంత్రి టిజి. భరత్‌కు అత్యంత సన్నిహితుడుగా ఉంటూ వచ్చారు. టిడిపి ఎన్నికల్లో కూడా భరత్ గెలుపునకు కృషి చేశారు. సమాజ సేవలో భాగంగా బిఆర్‌కె ఫౌండేషన్ ను స్థాపించారు. ఈ సంస్థ ద్వారా పేదలకు వివాహ కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు, పేద పిల్లలకు చదువుల కోసం ఉచితంగా ఫీజులు పుస్తకాలు పంపిణీ, అనాధ పిల్లలకు వృద్ధులకు బట్టలు, ఆహారం పంపిణీ వంటి అనేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మరణ వార్తను తెలుసుకున్న పలువురు ప్రముఖులు సాయిబాబా సంజీవయ్య నగర్ లోని ఆయన ఇంటికి చేరుకొని నివాళులు అర్పించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, మేయర్ బి వై రామయ్య, వైసిపి కర్నూలు నియోజకవర్గ ఇన్చార్జి ఎఎండి ఇంతియాజ్ తో పాటు పలువురు కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులు టిడిపి, వైసిపి నాయకులు ఆయనకుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఆయన పార్థివ దేహానికి మునగాలపాడు లోని స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య బొల్లెద్దుల సరస్వతమ్మ గృహిణిగా ఉన్నారు. పెద్దకూతురు విజయ ప్రత్యూష కార్పొరేటర్ గా ఉన్నారు. రెండో కూతురు సాయి ప్రియాంక టిడిపి నాయకులు మణిగాంధీ ఇంటికి ఇచ్చి వివాహం చేశారు. కుమారుడు శేషసాయి సివిల్స్ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. ప్రశాంత్ సాయి పవన్ కాంత్ వ్యాపారంలో స్థిరపడ్డారు.



రామకృష్ణకు నివాళి అర్పిస్తున్న మంత్రి టిజి.భరత్





నివాళి అర్పిస్తున్న ఎంపీ నాగరాజు,(బొల్లెద్దుల రామకృష్ణ)

జిపిఎస్‌ను ఉపసంహరించుకోవాలి ఎస్‌టియు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం జిపిఎస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాం ఖాన్ ఎస్‌టియు భవనంలో సురేష్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోకారి మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వం ఉద్యోగులకు సిపిఎస్ స్థానంలో ఆమోదయోగ్యం కాని జిపిఎస్ అమలుకు సంబంధించి గెజిట్ విడుదల చేయడం సరైనది కాదన్నారు. దీనిని ఎస్‌టియు పరంగా తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే జీవో నెంబర్ 54 ను రద్దు చేయాలని, అందరికీ ఆమోదయోగ్యమైన కాంట్రి బ్యూషన్ లేనటువంటి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నారా లోకేష్ యువ గళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ప్రాథమిక విద్యా వ్యవస్థను బలోపితం చేయడానికి జీవో నెంబర్ 117 ను వెంటనే రద్దుచేసి, ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు, ఉర్దూ కన్నడ మాధ్యమాలను కూడా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు పని భారం తగ్గించి ఒక సెక్షన్‌లో 45 మంది విద్యార్థులకు మించితే రెండవ సెక్షన్ మంజూరు చేయాలన్నారు. యూప్‌ల పని భారం తగ్గించాలన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించలన్నారు. ఈ సమావేశంలో శేఖర్ ,ధనుంజయ, రామాంజనేయులు,గోవింద్ పాల్గొన్నారు.



మార్కెట్లోకి నూతన గుర్ఖా వాహనం

ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్ : కల్లూరు మండలం లక్ష్మీపురం జాతీయ రహదారిలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఫోర్స్ మోటార్స్ షో రూంలో నూతన గుర్ఖా వాహనాన్ని పాణ్యంఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మార్కెట్ లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో షోరూం యజమానులు వెంకటేశ్వర రెడ్డి, ఉలింద కొండ ఇవి రమణ, నంద్యాల పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కె. పార్వతమ్మ, విద్యా సంస్థల అధినేత డాక్టర్ కెవి సుబ్బారెడ్డి, కార్పొరేటర్ కైపా పద్మలత రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు డి రామాంజనేయులు, నాయకులు మహేష్ గౌడ్,తడకన పల్లే సర్పంచ్ సహారాబి పాల్గొన్నారు.

గొల్లలదొడ్డిలో మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోనీ గొల్లలదొడ్డిలో చందమామయ్య మొహర్రం సందర్భంగా వేడుకలు ఆదివారం సంబరంగా జరిగాయి. నలుమూలల నుండి భక్తులు అదికమొత్తంలో చేరుకొని మొక్కులు తీర్చుకొన్నారు. వచ్చిన భక్తులకు తాగు నీరు సమస్యలు లేకుండా సర్పంచి రామలింగమ్మ, శాంతి భద్రతలను అదుపు చేయుటలో ఎస్‌ఐ తిమ్మారెడ్డి సిబ్బందితో తగు చర్యలు చేపట్టారు.



చర్మకారులకు ఆరోగ్య బీమా కల్పించాలి

- ఆంధ్రప్రదేశ్ చర్మకార వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

గాలికి ధూళికి బతికే చర్మకారులకు ఆరోగ్య భీమా కల్పించాలని ఆంధ్రప్రదేశ్ చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యం డి ఆనంద్ బాబు, సుమాల ఆంథోని డిమాండ్ చేశారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలోని శివ సర్కిల్ వద్ద ఉన్న కెవిపిఎస్ కార్యాలయంలో చర్మకార వృత్తిదారుల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి కాలేబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యండి ఆనంద్ బాబు, సుమాల ఆంథోని, పట్టణ అధ్యక్షులు భాస్కర్, ఉపాధ్యక్షులు సుమాల రాజు పాల్గొని మాట్లాడుతూ తరతరాలుగా అంటరానితనం, ఆకలి, అవమానాలను భరిస్తూ వచ్చి, బతికే అవకాశం లేక, తాతల తండ్రుల నాటినుండి వారసత్వంగా వచ్చిన వృత్తినే భృతి కోసం ఎంచుకొని, ఎండనక వాననక ఆరుబయల్లనే వృత్తి కేంద్రాలుగా ఎంచుకొని పనిచేస్తున్న చర్మకారులు అర్ధాయుస్సు తో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. అణగారిన వృత్తిదారుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ప్రతి చర్మకారుడికి ప్రభుత్వమే ఉచిత ఆరోగ్య భీమాను కల్పించాలన్నారు. చర్మకారులందరికీ వృత్తి కిట్లు ఇస్తామన్న హామీని గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, ఈ ప్రభుత్వమైనా అమలు చేయాలన్నారు. అలాగే ప్రతి చర్మకార వృత్తిదారుడికి వృత్తి కేంద్రాలను నిర్మించి ఇవ్వడంతో పాటు, పెన్షన్‌ను రూ.6వేలకు పెంచి, నూతన పెన్షన్ నమోదు ప్రక్రియను ప్రారంభించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేలా కార్యకర్తలందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పట్టణ నాయకులు గుంటెప్ప, బి శాంతి, ఎం భాస్కర్ శ్రీనివాసులు ప్రభుదాస్ ఆనంద్, ఎం రంగన్న, చిన్నప్ప, హనుమంతు, మారెప్ప, అంజి తదితరులు పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో నిర్మించారు..కంప చెట్లు పెంచుతున్నారు..!

-.

- వినియోగంలో లేని ఎస్ఎస్ ట్యాంకు - నీటి కోసం తప్పని తిప్పలు

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామాలలో శాశ్వతంగా నీటి సమస్య పరిష్కరించాలని ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాయి. పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆశయాలు తుంగభద్ర నది నీటిలో కొట్టుకుపోతున్నాయి. కోట్ల రూపాయలతో నిర్మించిన నీటి పథకంలో కంప చెట్లు పెరుగుతున్నాయి అంటే అధికారుల నిర్లక్ష్యం ఎంతుందో అర్థమవుతుంది. దీంతో అనేక గ్రామాలలో కనీసం మంచినీరు తాగడానికి అందకపోవడంతో ప్రజలు విలవిలలాడుతున్నారు...

కర్నూలు జిల్లా కౌతాళం మండలం పరిధిలోని తుంగభద్ర నది తీరం గ్రామాలలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించడానికి అప్పటి ప్రభుత్వం రూ.10 కోట్లతో వల్లూరు, హాల్వి గ్రామాల మధ్య సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించారు. 39 ఎకరాల విస్తీర్ణంలో ట్యాంకును ఏర్పాటు చేశారు. దీని ద్వారా 12 గ్రామాలకు సుమారు 30 వేల జనాభాకు తాగునీరు అందించడానికి నిర్మించడం చేపట్టారు. తుంగభద్ర నది నుండి నీటిని పంపింగ్ చేసి ఈ ఎస్ఎస్ ట్యాంక్‌లో ఆరు నెలలకు పైగా సరఫరా చేసే నీటిని నిల్వ చేసే సామర్థ్యంతో నిర్మించారు. మండలంలోని వల్లూరు, గుడి కంబాలి, హాల్వి, కుంబళనూర్, కుమ్మలనూరు క్యాంపు, గోతులదొడ్డి, మధిర, పొదలకుంట గ్రామాలతోపాటు కోసిగి మండలంలోని కడదొడ్డి, అర్లబండ గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. ప్రస్తుతం నది నుండి డైరెక్ట్‌గా ఫిల్టర్ బెడ్‌లకు పంపింగ్ చేసి మూడు గ్రామాలకే నీరు సరఫరా అవుతుంది. హాల్వి గ్రామంలో 15, 20 రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారు. దీంతో అనేకమంది కుటుంబాలు బోర్ల నీటిపై ఆధారపడుతున్నారు. తాగడానికి అయితే మినరల్ వాటర్ కొనుగోలు చేయాల్సిందే.

పరిష్కారానికి మార్గం : తుంగభద్ర నది నుండి ఎస్ ఎస్ ట్యాంక్ వరకు (సుమారు మూడు కిలోమీటర్లు సుమారు మూడు కిలోమీటర్లు) పైప్లైన్ ఏర్పాటు చేయాలి. నీటిని పంపింగ్ కోసం సుమారు 50 హెచ్‌పి సమర్థం గల రెండు రెండు లేక మూడు విద్యుత్ మోటర్ ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు మేధావులు సూచిస్తున్నారు. ఈ పనులు ట్యాంకు ప్రారంభానికి ముందే చేసి ఉంటే నీటి సమస్య ఉండేది కాదని ఆయా గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి సమస్య పరిష్కారం కావడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



కంపచెట్లు పెరిగిన ఎస్ఎస్ ట్యాంకు

తాగునీటిని కొంటున్నాం

- రవి, హాల్వి గ్రామం.



హాల్వి గ్రామంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. ప్రతిరోజు తాగడానికి నీటి కోసం కొనుగోలు చేస్తున్నాం. సామాన్య ప్రజల పరిస్థితి ఇంకా వర్ణణాతీతంగా ఉంది. నీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

పాచి పట్టిన నీళ్లు వస్తున్నాయి

- సిద్ధన్న గౌడ్, హాల్వి గ్రామం.



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సరఫరా చేస్తున్నా నీరు పాచి పట్టిన నీరు సరఫరా చేస్తున్నారు. గ్రామంలో 15, 20 రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. రెండు బోర్ల ద్వారా సరఫరా అవుతున్న నీరు ప్రస్తుతం ఒకే ఒక బోర్ నుండి నీటి సరఫరా అవుతున్నాయి. ఫిల్టర్ చేసిన నీరు సరఫరా చేయాలి.

నిధులు మంజూరు చేయాలి

- మల్లయ్య, సిపిఎం సీనియర్ నాయకులు.



మండలంలోని వల్లూరు, హాల్వి గ్రామాల మధ్య నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకుకు నిధులు మంజూరు చేయాలి. కొత్త పైప్ లైన్, కొత్త విద్యుత్ మోటార్ల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి గ్రామాలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు మారుతున్నా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజలకు నిత్యం తాగునీరు అందేలా చూడాలి. లేనిపక్షంలో ప్రజల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతాం

చేయి తడపనిదే పనిచేయడు

లంచావతారమెత్తిన హోళగుంద ఇఒపిఆర్‌డి ?..

ప్రజాశక్తి -హోళగుంద

మండల కేంద్రమైన హోళగుందలో పనిచేస్తున్న ఇఒపిఆర్‌డి అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో జరిగే అభివద్ధి పనులకు బిల్లులు కావాలంటే చెయ్యి తడపనిదే సంతకం చెయ్యడనే విషయం బాహాటంగా వినిపిస్తుంది. మండల పరిధిలోని ఒక గ్రామ పంచాయతీ పరిధిలో ఆర్‌బికె హెల్త్ క్లినిక్ పరిసర ప్రాంతాల్లో జంగల్ క్లియరెన్స్ చేసిన బిల్లును సర్పంచి డ్రా చేసుకోవాలనుకుంటే ఇఒపిఆర్‌డి రూ. 20000 లంచం అడిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి గ్రామపంచాయతీ నిర్వహణకు కీలకంగా ఉండాల్సిన అధికారి పక్కదారి పట్టి అవినీతి అక్రమాలకు పాల్పడుతుండటంతో ప్రభుత్వం నుండి పంచాయతీకి వచ్చే నిధులు దుర్వినియోగం అవుతుండటంతో గ్రామాలు అభివద్ధికి నోచుకోవడం లేదు. పంచాయతీ పరిధిలో జరిగే ప్రతి పని విషయంలోనూ ఆ అధికారి జోక్యం పెరిగిపోవడంతో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వారంలో మూడు రోజులే విధులు: వారంలో ఆరు రోజులు పాటు పని చేయవలసిన ఇఒపిఆర్‌డి మూడు రోజులే విధులకుహాజరవుతున్నారు. కర్నూలు నుంచి ఆయన విధులకు హాజరవుతుండడంతో ఏ టైంకు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఆయన రాక కోసం ఎంపిడిఒ కార్యాలయంలో వేచి చూసే పరిస్థితి నెలకొంది. ఆయన జిల్లా స్థాయి అధికారులకు మించి అట్టహాసంగా విధులకు హాజరవుతూ ఉంటారు. ఆయన హోళగుందకు విధులకు రావాలంటే సొంత కార్లో వస్తూ ఉంటారు. కర్నూలు నుంచి హోలగుందకు రావాలంటే రోజుకు కనీసం రూ.2000 నుంచి రూ.3000 ఖర్చు అవుతుంది. ఇలా విలాసవంతమైన జీవితాన్ని ఆయన అనుభవిస్తున్నారంటే అవినీతి అక్రమాలు ఏ విధంగా ఉంటాయో ఇట్టే అర్థమవుతుంది ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఆయన అవినీతి అక్రమాలపై ఆరా తీయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రూ. 20,000 ఇస్తేనే బిల్లు పాస్ చేస్తా!...

మండల పరిధిలోని మార్లమడికి గ్రామానికి చెందిన సర్పంచి ఎంకప్ప కుమారుడు రమేష్‌ను ఆర్‌బికె హెల్త్ క్లినికల్ దగ్గర జంగల్ క్లియరెన్స్ బిల్లు పాస్ కావాలంటే నాకు రూ. 20000 లంచంగా ఇవ్వాలని ఇఒపిఆర్‌డి చంద్రమౌళేశ్వర్ గౌడ్ డిమాండ్ చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు



బాధితుడు రమేష్

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి గాదిలింగప్ప, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్, సభ్యులు శ్రీనివాసులు, మల్లికార్జున, రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోనిలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే విస్మరించడం తగదన్నారు. జీఓ54 ద్వారా సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తీసుకురావడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. జిపిఎస్‌ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉపాధ్యాయులు ఉద్యమ బాటపట్టక తప్పదన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ నాయకులు నారాయణ, మల్లయ్య, నాగేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిపిఎస్ గెజిట్‌ను రద్దు చేయాలి : ఎస్టీయు

సిపిఎస్‌కు బదులు ప్రవేశపెట్టిన జిపిఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని ఎస్టియు జిల్లా కార్యదర్శి బి గోపాల్, అదనపు ప్రధాన కార్యదర్శి యంసి సుంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోనిలోని ఎస్టీయు భవన్‌లో మండల అధ్యక్షుడు చింతకుంట రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఆదోని, కౌతాళం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునఃప్రారంభించాలని కోరారు. పెండింగులో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయ ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు మానిపాటి సూర్యుడు, మండల నాయకులు రామాంజనేయులు, ఆర్‌బి వెంకటేసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడిన గాది లింగప్ప

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలి

ప్రజాశక్తి - మద్దికెర

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును ఎత్తివేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పులి ఇంద్ర శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పేద, మధ్య తరగతి విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును చదవడానికి శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా బీకాం జనరల్ కోసం కొనసాగించాలని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



మత్స్యకార సంఘం రాష్ట్ర కార్యదర్శి బిజెపిలో చేరిక

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని పట్టణంలోని 35వ వార్డు కౌన్సిలర్ లలితమ్మ భర్త మధుసూదన శర్మ ఆధ్వర్యంలో రాష్ట్ర మత్స్యకార సంఘం రాష్ట్ర కార్యదర్శి పగడాల నీలకంఠ ఆదివారం బిజెపిలో చేరారు. ఎమ్మెల్యే పార్థసారథి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదోని అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడతానని, ఆదోని అభివృద్ధి కోసమే ప్రజలు నాకు ఓటు వేసి గెలిపించారన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి నాకు ఎవరు కలిసి చేస్తామంటే వారందరినీ పార్టీలో చేర్చుకుని ఆదోని అభివృద్ధిలో భాగస్వాములను చేస్తానని అన్నారు. మధుసూదన శర్మ, నీలకంఠ మాట్లాడుతూ ఎమ్మెల్యే పివి పార్థసారథి ఆదోని అభివృద్ధి కోసం నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ పట్టణాభివృద్ధికి, కృషికి ఆకర్షితులయి బిజెపి పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బడాయి పంపాపతి, బిజెపి పట్టణ అధ్యక్షులు జిందే సాయి, మధుమాదవ్ , కౌన్సిలర్ చిన్న, కల్లుబోతుల సురేష్, కృష్ణమోహన్, రవికిరణ్, వేణు, శేఖర్, భాస్కర్, విజయ్,వీరేష్, దస్తగిరి,భరత్,వీరేష్ పాల్గొన్నారు.





పేదలకు ఎల్లవేళలా అండగా ఉంటా

- ఎమ్మెల్యే బూసినే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

పేదలకు ఎల్లవేళలా అండగా నిలబడతానని ఆలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బూసినే విరుపాక్షి తెలిపారు. ఆదివారం చిప్పగిరి మండలంలోని నగర డోనా గ్రామంలో బోయ మల్లెప్ప (63) అనారోగ్యంతో చనిపోవడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన కొడుకు వీరాంజనేయులును ఓదార్చి, కుటుంబానికి అండగా ఉంటానన్నారు. రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. సర్పంచ్ మల్లమ్మ, వైసిపి నాయకులు నాగేంద్ర, భీమ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలూరులో టిడిపిని బతికించండయ్యా...

ఇన్చార్జిని మార్చాలని అధిష్టానాన్ని కలసిన నేతలు

ప్రజాశక్తి- ఆలూరు

గత ముప్పయి ఏళ్లుగా ఆలూరు అసెంబ్లీ బరిలో వరుసగా ఓటమి పాలై చతికిలపడుతున్న టిడిపిని బతికించాలని ఆలూరు నియోజకవర్గానికి చెందిన టిడిపి ముఖ్య నేతలు అధిష్టానాన్ని కలసినట్లు తెలిసింది. నియోజకవర్గంలోని మండల కన్వీనర్లు, మాజీ మండల స్థాయి ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు టిడిపి అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్ల శ్రీనివాసయాదవ్‌ను కలిసారు. గత ఎన్నికలో నిలిచిన వీరభద్రగౌడ్ నాయకులను సమన్వయం చేసుకోక వెళ్లకపోవడం వల్ల ఓటమి చెందారని నియోజకవర్గ టిడిపి నేతలు వివరించినట్లు తెలిసింది. సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రం మొత్తం టిడిపి హవా కొనసాగిన పరిస్థితిలో ఆలూరులో ఓడిపోవడం దారుణమని చెప్పామన్నారు. ఆలూరు నియోజకవర్గంలో ప్రధానంగా టిడిపిలో ముఠాల మధ్య తగాదాలు ఉన్నాయని, ఈ విషయంలో అధిష్టానం దృష్టి సారిస్తే బాగుంటుందని వివరించినట్లు తెలిపారు. ఇన్చార్జిని నియమించేటప్పుడు టిడిపి నాయకుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఇన్చార్జి మరొకరిని నియమించాలని అధిష్టానాన్ని కొంతమంది టిడిపి నాయకులు కోరిన విషయంపై వీరభద్ర గౌడ్ అనుచరులు ఆదివారం ఆయననే ఇన్చార్జిగా కొనసాగించాలని సోషల్ మీడియా, పత్రిక ప్రకటనల ద్వారా కోరుతున్నారు. పార్టి ఇన్చార్జి మార్పుతోపాటు ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లు తెలిసింది. టిడిపి ముఖ్యనేతలు అధిష్టానాన్ని కలసి రావడంతో భవిష్యత్తులో టిడిపి నాయకత్వం మార్పు జరుగుతుందోమోనని జోరుగా రాజకీయ చర్చ జరుగుతుంది.



టిడిపి అధిష్టానాన్ని కలిసి వివరిస్తున్న ఆలూరు టిడిపి నాయకులు



పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

ండవ ముంబాయిగా పేరుగాంచిన ఆదోనిలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోనిలోని సిఐటియు కార్యాలయంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేశ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు పరిశ్రమలకు కేరాఫ్‌గా ఉన్న ఆదోని నేడు వలసలకు కేరాఫ్‌గా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధిస్తే పరిశ్రమలు తరలివచ్చి యువతకు ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదోని నుండి ఇప్పటికే 60 వేల మంది దాకా వలస వెళ్లారని, వలసల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులు వెంకటేష్, సంజీవ్, వసంత్, మల్లి, భాస్కర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీలో గందరగోళాన్ని పరిష్కరించాలి

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి తాపీ మేస్త్రీలను ఆదుకోవాలి

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు : తెలుగుదేశం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నూతన ఇసుక పాలసీలో నెలకొన్న గందరగోళాన్ని తక్షణమే పరిష్కరించి , ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి తాపీ మేస్త్రీని ఆదుకోవాలని ఎపి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా సహాయ కార్యదర్శి యు.వీరేష్ కోరారు. సిపిఐ కార్యాలయంలో ఎపి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌అండ్ వర్కర్స్ యూనియన్ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. యు.వీరేష్ మాట్లాడుతూ ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన, బిజెపి (కూటమి) వాగ్దానం చేసి ఉచిత ఇసుక పాలసీ తీసుకొస్తామని ప్రకటించి, నేడు ఇసుక పాలసీను చూస్తే లబ్ధిదారులకు తక్కువ రేటుకు ఇసుక ఇస్తున్నట్లు ఉంది కాని, ఉచితంగా లేదని వారు తెలిపారు. వైసిపి ప్రభుత్వం హయాంలో ఇసుక పాలసీ వలన భవన నిర్మాణ రంగం కుదేలు అయిందని వైసిపి ప్రభుత్వం నాయకులు ఇసుక మాఫియాతో రూ.కోట్లు సంపాదించాని, అయితే తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీలో రూ.250 టన్ను ఇసుక ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు తగ్గించడం వలన లబ్ధిదారులకు భవన నిర్మాణ వ్యాయామం తగ్గుతుందని, ఇది హర్షించదగ్గ విషయం. అయినప్పటికీ ఇంకా ఇసుక పాలసీలో గందరగోళాన్ని సవరణ చేయాల్సిందన్నారు. ఉందని ఇప్పటికి కొన్ని చోట్ల ఇసుక రేటు, టన్ను రేట్లలో రాజకీయ జోక్యంతో రేటు పెంచి అమ్ముకునే విధానం రాకుండా జాగ్రత్త పడవలసిన అవసరం ఉందని వారు రాష్ట్ర ప్రభుత్వానికి సూచన చేశారు. ఈ సమావేశంలో ఎపి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, సుంకన్న, నరసప్ప, నరసింహులు, నాగన్న, రవి, హనుమంతు, బాష, వెంకటేష్, గోపాల్ పాల్గొన్నారు

సిసిఆర్‌సి కార్డులతో కౌలుదారులకు బహుళ ప్రయోజనాలు

- ఏడిఏ మహమ్మద్ ఖాద్రి, ఏవో హేమలత

ప్రజాశక్తి - గోనెగండ్ల

పంట సాగు హక్కు పత్రాల (సిసిఆర్‌సి కార్డుల) ద్వారా కౌలు రైతులు బహుళ ప్రయోజనాలను పొందవచ్చని ఎమ్మిగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రి, గోనెగండ్ల ఏవో హేమలత తెలిపారు. ఈ పంట సాగు హక్కు పత్రము అనేది భూ యజమానికి, సాగుదారులకు మధ్య ఒప్పంద పత్రం అని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు కౌలు రైతులు చాలా వరకు నష్టపోతుంటారని, దీన్ని నివారించడానికి పంట సాగు హక్కు పత్రం ఇస్తారని తెలిపారు. భూమి యజమాని తమ పొలాలను కౌలుదారులకు ఇచ్చినప్పుడు కౌలు పత్రం 11 నెలలు మాత్రమే విలువ ఉంటుందన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎమ్మిగనూరు 965, గోనెగండ్ల 855, నందవరం 970, మంత్రాలయం 810 మంది కౌలుదార్లను గుర్తించి వారికి పంట సాగుహక్కు పత్రాలను అందజేయవలసి ఉందన్నారు. కౌలు పత్రాల వలన చాలా లాభాలు ఉన్నాయని, అన్నదాత సుఖీభవ, పియం కిసాన్, పంటల బీమా, పంట నష్ట పరిహారం, సున్నా వడ్డీ పథకాలతో పాటు దాన్యం పండించిన తర్వాత కొనుగోలు కేంద్రాలలో అమ్మవచ్చన్నారు. కౌలుపత్రాలు కౌలు రైతులు పొందాలంటే రైతు సేవా కేంద్రాలలో ఉన్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు,యం.పి.ఓ లను కలిసి కౌలు పత్రం పొందే దరఖాస్తులో భూమికి సంబందించిన వివరాలు నమోదు చేసి భూ యజమాని మరియు కౌలు రైతు సంతకాలు చేసి గ్రామ రెవిన్యూ అధికారికి అందజేయాలన్నారు. పొలం కౌలుకు చేసే ప్రతి రైతు కౌలురైతు పత్రాన్ని పొంది వీటి ద్వారా వచ్చే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఎల్ఎల్‌సి కాలువలో వ్యర్ధాలను తొలగించండి

పజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరులోని ఎల్ఎల్‌సి కాలువలో రాయలసీమ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఐక్యవేదిక కన్వీనర్ టీచర్ నాగన్న, విద్యార్థి సంఘం నాయకులు కృష్ణ సురేంద్ర, ఖాజా, రఘునాథ్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణ ప్రజలకు తాగునీరు రైతులకు సాగునీరు అందించే కాలువ వ్యక్తపదార్థాలతో చెత్తాచెదారాలతో నిండి ఉండి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఎల్ఎల్‌సి , మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రజలకు స్వేచ్ఛమైన సాగునీరు పొందడం కూడా జీవించే హక్కులో భాగమని , ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా సురక్షితం కానీ నీరు తాగడం వలన సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, డయేరియా లాంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలుతున్నాయని హెచ్చరించినా అధికారులు నాయకులు కనీసం స్పందించకపోవడం సరైంది కాదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పట్టణ ప్రజలకు తాగునీరు అందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేష్, వెంకటేష్, రమణ పాల్గొన్నారు.



శ్రీ మఠంలో కర్ణాటక ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రవీంద్ర

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రవీంద్ర కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి, పిఆర్ఒ ఐపి నరసింహమూర్తి సహాయక పిఆర్ఒ హోన్నొళ్ళి వ్యాసరాజాచార్ సిబ్బంది బింధు మాధవాచార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు ఇచ్చారు. వారి వెంట గిల్లెసూగూరు క్యాంప్ కాంట్రాక్టర్ నాగేష్, రాఘవేంద్ర ,నాగేష్ తదితరులు ఉన్నారు